క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


బలరామకృష్ణమూర్తి, కరణం వెంకటేష్‌బాబు

చీరాల: తెలుగు రాష్ట్రాల ప్రజలకు, చీరాల నియోజకవర్గ ప్రజలందరికి భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబులు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త కాంతులు తేవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

● నేడు భోగి పండుగ


దుర్గామాతా అలంకరణలో వేసిన ముగ్గు

చీరాల రూరల్: సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేసే మన దేశంలో పండుగలకు ఎంతో విశిష్టత ఉంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముత్తూట్ ఫిన్ కార్ప్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నమార్కెట్ వద్దగల కార్యాలయం రోడ్డుపై ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీలలో పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రకరకాల రంగవల్లులను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. కొంతమంది మహిళలు ముగ్గులను దేవుళ్ల రూపంలో వేయగా మరికొందరు మహిళలు సంప్రదాయాలను తెలిపే విధంగా ముగ్గులను అలకంరించారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించిన అనంతరం విజేతలను ప్రకటించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు భోగి పండుగ జరుపుకోనున్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతం


అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం పేద గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోట శ్రీనివాసకుమార్ ఆర్థిక సౌజన్యంతో నిర్వహించారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా పట్టణంలోని రామసుశీల నిలయంలో నిర్వహించారు. రోటరీ గవర్నర్ శరత్ చౌదరి దంపతులు, అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకర్‌రావు, షేక్ మహ్మద్‌రఫీ, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వీరవల్లి సుబ్బారావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు



కారంచేడు: ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ (నాన్ మెడలిస్ట్ డబుల్స్) పోటీలు పోటాపోటీగా సాగాయి. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రం కారంచేడు డాక్టర్ రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 52 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు, మెమోంటోలు బహూకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సలగల రాజశేఖర్, పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైవేపై ప్రమాదం



మార్టూరు: అర్ధరాత్రి హైవేపై పెనుప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదకర ఘటన శనివారం అర్ధరాత్రి స్థానిక హీరో షోరూం ఎదురు జరిగింది. అందిన వివరాల మేరకు.. శనివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల ప్రాంతంలో మార్టూరు ఫ్లై ఓవర్ డౌన్‌లో హీరో షోరూం దగ్గర చిలకలూరిపేట నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్ ప్రయాణికులు దిగటం కోసం ఆగి ఉంది. అదే మార్గంలో మార్టూరు సర్వీస్ రోడ్డులోకి వెళ్లటం కోసం వచ్చిన ఓ లారీ ముందున్న ట్రావెల్స్ బస్సును చూసి దాని వెనుక ఆగింది. అదే సమయంలో ఒంగోలు వైపు వేగంగా వస్తున్న ఓ లారీ అదుపుతప్పి లారీని ఢీకొట్టగా ఆ లారీ తన ముందున్న బస్సును ఢీకొని ఆగిపోయింది. ప్రమాద దాటికి రెండు లారీలు తీవ్రంగా, ట్రావెల్స్ బస్సు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ప్రయాణికులు ఎవరు గాయపడకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంకెల ఆటలు.. బతుకులకు బీటలు

- ● షేర్ మార్కెట్ ఆధారంగా దోపిడీలు
- ● చివరి అంకెలతో గారడీలు చేస్తూ బానిసలుగా చేస్తున్న వైనం
- ● పేదల రక్తాన్ని పిండుతున్న ఏజెంట్లు
- ● పోలీసులు దృష్టి సారిస్తే పేదలకు మేలు



చీరాల టౌన్:

చీరాల నియోజకవర్గం పేదలు, రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, చేనేత కార్మికులు అధికంగా ఉండే ప్రాంతం. కార్మికులు, కర్షకులు రోజు తమ వృత్తుల్లో లీనమై కుటుంబాలను పోషించుకుంటారు. కానీ ప్రస్తుతం జూదానికి అలవాటు పడి అప్పులు పాలు అవుతున్నారు. అత్యాశకు పోయి జూదాల్లో డబ్బులు పెట్టి తీర్చలేక అల్లాడుతున్నారు. ఆన్‌లైన్ పేకాట ఓ వైపు, షేర్ మార్కెట్ ఆధారంగా జూదం చీరాలలో పేదలను బలిపశువులను చేస్తుంది. షేర్ మార్కెట్ జూదం సెన్సెక్స్‌లో చివరి అంకె, నిఫ్టీలో చివరి అంకెను కలిపి ఒక సంఖ్యగా లెక్కిస్తున్నారు. ఈ రెండు సంఖ్యలు కలిపి లెక్కించగా 90 వస్తే బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి 60 రెట్లు అధికంగా డబ్బులు చెల్లిస్తామని ఆశ పెట్టి పేదల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారు. షేర్ మార్కెట్ ఆధారంగా నిర్వహించే ఈ జూదాన్ని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. ఈ ఆట ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా జరుగుతూనే ఉంది. చీరాల నియోజకవర్గంలో చేనేతలు, పేదలు, వ్యవసాయ, రోజువారీ కూలీలు అధికం. చీరాల మండలంలోని దేవినూతల నుంచి వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి గ్రామం వరకు ఎక్కువ భాగం నివసించేది పేదలే. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. అయితే ప్రస్తుతం ఈ గ్రామ పంచాయతీలతో పాటుగా మున్సిపాలిటీలోని వార్డుల్లో షేర్ మార్కెట్ దోపిడీ నడుస్తుంది.

కార్మికుల పైనే కన్ను..

బేల్దారి పను**లు** చేసుకునే **వారు,** చేనేత వత్తిపై **ఆధార** పడి జీవిస్తున్న **వారు, కూర** గాయలు అమ్ము**కునే వారు, ఆటో** డ్రైవర్లు, పెయిం**ట్ పనికి వెళ్లే దినసరి కూలీలే టార్గె**ట్‌గా ఈ దోపిడి జరుగుతోంది. శివారు **ప్రాం**తాలు, మారుమూల గ్రామాలతో పాటు**గా** పట్టణంలోని వార్డుల్లో సైతం నంబర్ల ఆ**ట,** రింగాట, బ్రాకెట్, ఆటల పేరుతో పేద**ల**ను దోచుకు తింటున్నారు. కాయకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పేదలు, చిరువ్యాపారులు అత్యాశకు పోయి ఈ ఆటల్లో డబ్బులు వెచ్చిస్తున్నారు. మాయా జూదంతో పేద**లు** అప్పుల పాలవుతుండగా బుకీలు, ఏజెం**ట్లు** మాత్రం లక్షలు గడిస్తున్నారు. రూ.100 పెట్టుబడి పెడితే రూ.5 వేలు వస్తాయనే **ఆశలు** కల్పించి పేదలు ఈ ఆటల వైపు మొగ్గు **చూపేలా** గ్రామాలు, వార్డుల్లో ఏజెంట్ల ద్వారా **డబ్బులు** వసూళ్లు చేస్తున్నారు. ప్రతి రోజుల ఉద**యం ఏజెం**ట్లు ద్వారా ఈ జూదంలో పెట్టుబడి పెట్టి **సాయం**త్రానికి సెన్సెక్స్‌లో వచ్చే షేర్ మార్కెట్ **ఫలితాల** ప్రకటన అనంతరం ఆఖరి నెంబర్లు ఆధారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. షేర్ మార్కెట్ జరిగే **ప్రతి రోజు** ఈ జూదం జోరుగా జరుతుంది. సెలవు రోజుల్లో మాత్రం జూదగాళ్లు బోసీ అనే ఆటలు ఆడుతున్నారు. ఈ షేర్ మార్కెట్ జూదంలో పెట్టుబడి పెట్టే వారికి అసలు ఈ జూదంలో విజేతగా ఎలా నిర్ణయిస్తారో కనీసం అవగాహన లేకపోవడంతో ఏజెంట్లు మాయమాటలతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు.

జూదానికి సూత్రధారులెవ్వరు ?

ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికి పెద్ద మొత్తంలో షేర్ జూదం జరుగుతున్నా పోలీసులు కనిపెట్టలేకపోతున్నారంటే ఏవో కారణాలు ఉండవచ్చనే అనుమానాలు జరుగుతున్నాయి. నెలకు రూ.2 కోట్లకు పైగానే జూదం జరుగుతున్నప్పటికి సూత్రదారులను గుర్తించలేకపోతున్నారంటే ఆ రహస్యం తేల్చాల్సి ఉంది. చీరాల రూరల్ సర్కిల్ పరిధిలోని చీరాల రూరల్, వేటపాలెం పోలీస్ స్టేషన్‌లతో పాటుగా పట్టణంలోని ఒన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో షేర్ మార్కెట్ జూదం నిర్వాహకులు, బుకీలు ఉన్నారు. రోజువారీ కూలీలు, రిక్షా కార్మికులు వీరి బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. షేర్ మార్కెట్ జూదానికి విస్తృతంగా ఏజెంట్లు, రోజు నగదు మార్పిడీ, పేదల నుంచి డబ్బుల వసూళ్లు చేస్తుంది ఎవరు? ఎవరికి చెల్లిస్తున్నారు ? ఎంత కమీషన్లు వసూళ్లు చేస్తున్నారు ? ఎవరెవరికి ఇస్తున్నారో ? పోలీసులు విచారణలు చేస్తేనే బహిరంగం అవుతాయి.

పోతే రూ.500 వస్తే రూ. 30 వేలు..

పలానా వ్యక్తికి ఈ జూదంలో 500 పెట్టుబడిపెడితే రూ.30 వేలు వచ్చాయని జోరుగా ప్రచారాలు చేసుకుని రోజుకు లక్షల్లో షేర్ దోపిడీ చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ముఖ్యంగా ఈపురుపాలెం, తోటవారిపాలెం, 300 కాలనీ, జాండ్రపేట, పేరాల, వేటపాలెం తదితర చేనేతలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ జూదం నడుస్తుంది. పోతే రూ.500 వస్తే రూ. 30 వేలు అనే భావనతో ఎక్కువ మంది పేదలు ఈ జూదంలో డబ్బులు కట్టి అప్పులు పాలు అవుతున్నారు. ఈ జూదంలో డబ్బులు కట్టే వ్యక్తి సాయంత్రం షేర్ మార్కెట్‌లో ఆఖరున పలానా నెంబర్ వస్తుందని బెట్టింగ్ కడుతాడు. ఇందుకు ముందుగానే ఏజెంట్‌కు డబ్బులు చెల్లించి ఒక పేపర్ తీసుకుంటాడు. ఒకవేళ తాను కట్టిన నెంబర్ (అరుదుగా వస్తుంది) షేర్ మార్కెట్ ఆఖరున వస్తే డబ్బులు చెల్లిస్తారు **ఏజెంట్లు. లేక**పోతే కట్టిన డబ్బులు హుష్. చీరాల **నియోజకవర్గం**లో షేర్ దోపిడీ ఎక్కువగా జరుగు**తున్నా పోలీ**సులు కట్టడి చేయలేకపోతున్నారే **విమర్శలు** ఉన్నాయి. నియోజకవర్గంలో **నెలకు** రూ.2 కోట్లకు పైనే దోపిడీ జరుగు**తుం**దని సమాచారం.

జూదాలకు అడ్డుకట్ట వేయకపోతే బుగ్గిపాలు..

చీరాల పట్టణంలో ఎక్కువ శాతంలో కర్షక, కార్మికులు బతు**కు**తున్నారు. ఉదయం నుంచి **రా**త్రి వరకు కష్టపడితేనే పొట్టనిం**డు**తుంది. వీరిని అలుసుగా **తీసు**కున్న కొందరు అక్రమార్కులు **చిన్న మొ**త్తంలో పెట్టుబడి పెట్టించి గుల్ల **చేస్తున్నారు.** షేర్ మార్కెట్, సెన్సెక్స్ చివరి **నంబర్ ఇలా** ఆటాడిస్తూ జూదంలో పేదలను **బానిసలు**గా చేస్తున్నారు. పోలీసులు వీరి **ఆట** కట్టించి పేదలను కాపాడాలి.

– దాసరి ఇమ్మానుయేల్, సామాజిక కార్యకర్త, చీరాల

కోడి పందేల నిర్వాహకులపై చర్యలు

చీరాల: చీరాల సబ్ డివిజన్ పరిధిలోని సంక్రాంతి వేడుకల సందర్భంగా కోడి పందేలు, పేకాట, మట్కా నిర్వహణకు అనుమతి లేదని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ తెలిపారు. ఎవరైనా పందులు, జూదం నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో పందేలు, జూద శిబిరాలు నిర్వహించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

బల్లికురవ: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాలు, గ్రామాల సమీపాల్లో కోడిపందేలు, అక్రమ మద్యం అమ్మకాలతో అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై జీవీ చౌదరి ఆదివారం హెచ్చరించారు.

శ్మశాన వాటికను ప్రారంభించిన ఎమ్మెల్యే


శ్మశాన వాటిక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు (చినగంజాం): దాతలందించిన రూ. 1.20 కోట్లతో ఆధునికీకరించిన పర్చూరు శ్మశాన వాటికను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. శ్మశాన వాటికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన మహాప్రస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించి, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సచివాలయ సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, గుంటూరు ఆర్టీఓ కఠారి రమేష్ నాయుడు, కఠారి సురేంద్ర, కోట హరిప్రసాద్, తేళ్ల రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూడవల్లి సేవ

వేటపాలెం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థానంలో ధనుర్మాసం వేడుకల్లో భాగంగా స్వామివారికి కూడవల్లి సేవ ఆదివారం నిర్వహించారు. మహావిష్ణువును గోదాదేవి ధనుర్మాసంలో ప్రాతఃకాలంలోనే లేచి స్వామివారికి పూజలు నిర్వహిస్తూ, తిరుప్పావై పాశుర పారాయణం నిర్వహించారు. ఈ మాసంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన కూడవల్లి 108 గంగాళాలతో పాయసాలు, వెన్నతో నింపి తదుపరి తులసీ దళం నుంచి స్వామివారికి నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హనుమాచారి, ప్రతి వెంకట సుబ్బారావు, ప్రత్తి కృష్ణసాయి రఘ మల్లికార్జున్, ప్రత్తి చంద్రశేఖర్ వెంకట భారతి, ప్రత్తి పుణ్యవతి, శరత్‌బాబు, దీప్తి, నాగరాజు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు

బల్లికురవ: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని విష్ణు ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం కొండాయపాలెం గ్రామంలోని హనుమత్ సమేత సీతాలక్ష్మణ కోదండ రామస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో భాగంగా రంగనాథ స్వామి గోదాదేవికి పసుపు కొట్టే కార్యాక్రమం, మంగళస్నానాలు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయడం, వసంతోత్సవం చేపట్టారు. ఆలయ ధర్మకర్త కక్కెర ఆంజనేయులు ఆధ్వర్యంలో అర్చకులు వినుకొండ మారుతి నరేష్, మోహన్‌కృష్ణ, జశ్వంత్ వేద మంత్రోచ్ఛరణలతో వేడుకలు నిర్వహించి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.


కొండాయపాలెంలో అలంకరణలో స్వామి, అమ్మవారు

గోదాదేవి సారె గ్రామోత్సవం..

చినగంజాం: గోదాదేవి సారె గ్రామోత్సవం కార్యక్రమాన్ని శ్రీదేవీ, భూదేవీ సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు అళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో చినగంజాంలో ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాలలో బాగంగా గత 27 రోజులుగా మహిళా భక్తులు తిరుప్పావై పఠనం నిర్వహిస్తూ 28 వ రోజు పాశురం పఠనం అనంతరం గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


వేటపాలెంలో అలంకరణలో గోదాదేవి అమ్మవారు

భద్రారెడ్డిని కలిసిన చిన హనిమిరెడ్డి


వైవీ భద్రారెడ్డితో చిన హనిమిరెడ్డి, మండల అధ్యక్షులు

అద్దంకి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి శనివారం రాత్రి మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుడు వైవీ భద్రారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో కలిశారు. నూతనంగా పదవులు వచ్చిన వారంతా ఆయనను కలిసి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తమ వంతు కృషిచేస్తామన్నారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునుపూడి రఘురామగుప్తా, నూతనంగా మండల అధ్యక్ష పదవులు పొందిన మండల అధ్యక్షులు ఉన్నారు.

అదుపుతప్పిన చేపల లోడు లారీ

మార్టూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా చేపల లోడుతో వెళుతున్న ఓ లారీ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈఘటన స్థానిక జాతీయ రహదారిపై రాజుపాలెం సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. అందిన వివరాల మేరకు.. విశాఖపట్నం నుంచి చెన్నైకి చేపల లోడుతో లారీ వెళ్తోంది. రాజుపాలెం సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీ ఎదురు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పిన లారీ రోడ్డు పక్కన గల ఫెన్సింగ్ను ధ్వంసం చేసుకుంటూ పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు వివేకానందుడు స్ఫూర్తిదాయకం

యద్దనపూడి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఖండాతరాలకు విస్తరించిన విశ్వగురువు వివేకానందుడు నేటి తరం యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని పర్చూరు ప్రాంత ఆర్‌ఎస్‌ఎస్ ఖండ ప్రముఖ్ అన్నమనేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని మండలంలోని పూనూరు గ్రామంలోని కస్బాచెరువు వద్ద ఉన్న వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ యువత చేతుల్లోనే దేశభవిష్యత్ ఆధారపడి ఉందని యువతి, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిశైవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలంరాజ్ రాజకుమార్‌శర్మ, బత్తుల కోటేశ్వరావు, గన్నమనేని సుబ్బయ్య, చెరుకూరి రాఘవచౌదరి పాల్గొన్నారు.

చీరాల అర్బన్/వేటపాలెం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో వివేకానంద విగ్రహానికి చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు గల ఓ పదిమంది యువకులనివ్వండి.. ఈ దేశం భవిష్యత్‌ను బంగారంగా మారుస్తా అని స్వామి వివేకానందుని మాటలు గుర్తు చేసుకున్నారు. అనంతరం స్వీట్లు, బిస్కెట్లు ఎస్‌వీ సుబ్బారావు ఆర్థిక సహకారంతో కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి బియ్యం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పోలుదాసు రామకృష్ణ, కార్యదర్శి చారుగుళ్ళ గురుప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, వీరాంజనేయులు పాల్గొన్నారు. అలానే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ఎదుట గల స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పూనూరులో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అతిథులు


● పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వివేకనంద స్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాళలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 6,7,8 తరగతుల విద్యార్థులను పది గ్రూపులుగా ఏర్పాటు చేసి జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి ఉపాధ్యాయుడు ఉమ్మిటి వేణుగోపాలరావు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం శేఖరరావు, మూర్తి, రాంబాబు, బండ్ల భారతి, ఊటుకూరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


క్రికెట్ మ్యాచ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసులు, మీడియా ప్రతినిధులు

చీరాల: మీడియా, పోలీసులు రెండు కూడా వృత్తిపరంగా ఎంతో ఒత్తిడితో కూడిన బాధ్యతలని.. ఒత్తిడిని పారదోలేందుకు ఇద్దరి మధ్య స్నేహపూరిత క్రీడలు ఎంతో దోహదపడతాయని ఈపూరుపాలెం రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసులు వర్సెస్ మీడియా ప్రతినిధుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహభరితంగా సాగింది. మొదట టాస్ గెలిచిన పోలీసులు బ్యాటింగ్‌ను ఎంచుకున్నారు. నిర్ణీత పది ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 113 భారీ స్కోర్‌ను చేసింది. 114 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మీడియా టీం మొదట్లో 2 కీలక వికెట్లు కోల్పోయింది. అనంతరం జర్నలిస్ట్ దిలీప్ దూకుడుగా ఆడుతూ, జర్నలిస్ట్ సూర్యప్రకాష్ సహాయంతో స్కోర్ పెంచారు. చివరకు ఆరు బంతుల్లో 17 పరుగులు చేయాల్సి ఉండగా భారీ సిక్స్, ఫోర్‌లతో 16 పరుగులు చేశారు. 113 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. చీరాల మీడియా టీంకు జర్నలిస్ట్ ప్రదీప్ కెప్టెన్‌గా, పోలీస్ టీంకు ఎస్సై చంద్రశేఖర్ కెప్టెన్లుగా వ్యవహరించారు.

తీరంలో సంక్రాంతి సందడి


వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. సంక్రాంతి సెలవులు, ఆదివారం కావటంతో వివిధ ప్రాంతాలనుంచి పండుగకు స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. దీంతో వాడరేవు కోలాహలంగా మారింది.


సముద్రం ఇసుకతో ఆటలాడుకుంటున్న చిన్నారులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళన ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే తమ మిత్రులను, విద్యనేర్పిన విద్యార్థులను కలుసుకునేందుకు పూర్వవిద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల ఆవరణలోనికి రావటంతో మిత్రుల కళ్లల్లో చెప్పలేని ఆనందంతో ఆలింగంతో నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకుంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న గదులు, ఆడుకున్న మైదానమంతా కలియతిరిగి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.